

# హింస అహింసలకు ఆవల

## ఉద్యమాలు విజయం సాధించడానికి ఏదైనా వ్యూహం ఉందా?

కె. బాలగోపాల్

ప్రజా ఉద్యమాల ప్రభావం రానురాను తగ్గిపోతోందనే నిరాశాపూరిత చర్చ ఇటీవలి కాలంలో బాగా వినిపిస్తోంది; మహా అయితే జరగబోయే వాటిని కాస్త జాప్యం చేయగలుగుతున్నాయి తప్ప అంతకుమించి అవి ఏమీ సాధించలేక పోతున్నాయనే అభిప్రాయం పెరిగింది. ఈ చర్చ ప్రధానంగా హింస, అహింసల చుట్టూ నడుస్తున్న మాట నిజమే కాని అందులోనూ నైతికంగా ఏ పద్ధతి మంచిదనే ధోరణిలో కాదు, వ్యూహంగా ఏది సరైనది అనే విషయంలో మాత్రమే జరుగుతోంది. ధర్నాలు చేసి చేసి విసిగిపోయిన వారు కొంచెం ఈర్ష్యగా హింసాత్మక ప్రత్యామ్నాయాల వైపు చూస్తుంటే సాయుధ సమూహాల నుండి బయటకు వచ్చిన చాలామందికి ఇప్పుడు నర్మదా బచావో ఆందోళన్ (NBA) ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

పిడివాద వైఖరుల వల్ల ఇప్పటికే చాలా హాని జరిగింది. ఇప్పుడు కొంతవరకైనా మనస్సు విప్పి మాట్లాడుకోగలగడం ఒక మంచి పరిణామం. హింస విషయంలో పిడివాదం పనికి రాదనే వాదన (హింసను సమర్థించే వాదన) నైతికంగా ఇబ్బందికరం కావొచ్చు కాని సమర్థించుకోలేని వాదనైతే కాదు. ఎవరి ప్రాణానికైనా విలువ ఉంటుందని నమ్ముతూ కూడ, పోరాట క్రమంలో జరిగే హానికి నైతిక బాధ్యత వహించడంలో నిర్లక్ష్య ధోరణి తగదని నమ్ముతూ కూడ ఆ వాదనను సమర్థించవచ్చు. దీని గురించి సందర్భం వచ్చినపుడు ఇంకొంచెం మాట్లాడుకుందాం. కానీ అనివార్యంగా ఈ మొత్తం చర్చ – ప్రత్యామ్నాయాలు ఎంత ప్రభావశీలంగా ఉన్నాయని అంచనా వేయడం మీద ఆధారపడి ఉంటుంది. దూరం నుంచి చూసినపుడు వాస్తవాలు సరిగ్గా గ్రహించలేకపోయే అవకాశముంది. ఆశలు, అంచనాలు, భ్రమలు అన్నీ కలిసి వాస్తవాన్ని మరుగు పరిచే అవకాశముంది. అందువల్ల ఇప్పటివరకు అవలంబించిన వ్యూహాలలో ఏ వ్యూహం ఏం సాధించగలిగింది అనే వాస్తవిక అంచనా వేసుకోవడం ఈ చర్చకు బాగా ఉపయోగపడుతుంది.

అన్ని వ్యూహాలు ఏవో కొన్ని అన్యాయాలను అరికట్టడానికి ఉపయోగపడినా, ఏ ఒక్క రంగంలోనూ ఏ ఒక్క ప్రధాన విధానాన్నీ తగినంత ఒత్తిడి పెట్టి పూర్తిగా ఉపసంహరించుకునేలా చేయడంలో ఏ వ్యూహమూ సఫలం కాలేదు. సామాజిక, ఆర్థిక వ్యవస్థల నిర్మాణాలలో అంతర్భాగంగా ఉన్న ఈ ధోరణులను ఏ వ్యూహమూ పూర్తిగా వెనక్కి (reverse) తిప్పలేకపోయింది. అయినా మనకు తెలిసిన ఏ ప్రధాన రాజకీయ ఉద్యమమూ, సామాజిక పోరాటమూ అణచివేతను తగ్గించడం కోసం మాత్రమే పని చేయడం లేదు. ఏదో రకమైన ఉపశమనం దొరికితే చాలని అనుకోవడం లేదు. సామాజిక వ్యవస్థాగత నిర్మాణాలతో సహా మొత్తం దేశ పాలకవిధానం మౌలికంగానే లోపభూయిష్టమైనదని, దానికి విరుగుడు అవసరమని, బహుశా పూర్తిగా తలకిందులు చేయాల్సిన అవసరం కూడ ఉందనేది వాటన్నిటి సాధారణ అవగాహన. మరి దానికి పనికొచ్చే ప్రభావశీలమైన వ్యూహం ఏదైనా మనకు తెలుసా? నేను రాజకీయ వ్యూహాల గురించి మాట్లాడటం లేదు. రాజ్యాన్ని, రాజకీయ వ్యవస్థను తమ అజెండాను అమలు చేయకుండా ఆపగల, అందుకు తగిన ఒత్తిడి పెట్టగల పోరాట వ్యూహాల గురించి మాట్లాడుతున్నాను. ఆ పోరాటాలు వర్గం లేదా కులం లేదా మరేదైనా సామాజిక అంశం ప్రాతిపదికనైనా నిర్మాణమై ఉండొచ్చు. వాటి అంతిమ లక్ష్యం రాజకీయ వ్యవస్థను సంస్కరించడం కావొచ్చు, లేదా కూలదోయడం కూడ కావచ్చు. ఆ పోరాటం ప్రధానంగానో, పాక్షికంగానో రాజకీయ వ్యవస్థలో అంతర్భాగంగా జరగొచ్చు లేదా పూర్తిగా బయట కూడ జరగొచ్చు. ఎలా జరిగినా ఈ దేశంలో మనకు ఎదురవుతున్న అసలు సమస్య ఇదీ: ప్రభుత్వాలు చేస్తున్న

పని హానికరమని నిరూపించినంత మాత్రాన ఆ పనులు చేయడాన్ని అవి ఆపవు. ఆ పనులు రాజ్యాంగ లక్ష్యాలకు, ఆదేశాలకు విరుద్ధంగా ఉన్నాయని రుజువు చేసినా ఆపవు. ముందుకు సాగడం దాదాపు అసంభవం అనేంతగా పరిస్థితులను దుర్లభం చేసినపుడు మాత్రమే ఆపుతాయి. ఇదీ ఈ దేశపు అనుభవం. ఏ ప్రజాస్వామిక వ్యవస్థ కూడ ఇలా ఉండకూడదు. కానీ భారత ప్రజాస్వామ్యం ఇలానే ఉంది. ముందుకు సాగడం అసంభవమయ్యే పరిస్థితులను కల్పించకుండా కేవలం ప్రభుత్వ చర్యలు అన్యాయమని, హానికరమని మనం గొంతు పోయేలా ఎంత అరిచి గీపెట్టి చెప్పినా ఫలితం ఉండదు.

అన్ని ఉద్యమాలనూ వేధిస్తున్న సమస్య ఇది. ఏ ఉద్యమం దగ్గరా పరిష్కారం లేదు. స్థానిక అణచివేత శక్తులను, లేదా ప్రపంచ అణచివేత శక్తుల స్థానిక రూపాలను అడ్డుకోవడం, బాధితుల పరిస్థితులను కాస్తో, కూస్తో మెరుగుపరచడమే విజయం అనుకున్నట్లయితే మాత్రం అన్ని వ్యూహాలూ – అవి హింసాత్మకమైనవైనా, శాంతియుతమైనవైనా – విజయం సాధించకుండా ఏమీ లేవు. దీని అర్థం ఈ విజయాలను తక్కువ చేసి చూపడం కాదు. వీటి ప్రయోజనాలు పొందిన వారు తమకు జరిగిన మేలును ఎలాగూ మరువరు కాబట్టి ఎవరైనా వాటిని తక్కువ చేసినా వాళ్ళకేం తేడా పడదు. కాని ఆ పరిమిత అర్థంలో కాకుండా, అంతకు మించిన పెద్ద విజయాలను సాధించడం మాత్రం ఈ ఉద్యమాలకు సాధ్యం కాలేదు. అది వారు అధిగమించలేని ఒక పెద్ద అడ్డుగోడగా ఉండిపోవడానికి కారణం భారత ప్రజాస్వామ్యానికి ఉన్న పరిమితులు.

నక్సలైట్లు – ముఖ్యంగా సంఖ్యారీత్యా పెద్ద పార్టీ అయిన మావోయిస్టులు – హింసాత్మక పోరాట వ్యూహాలను చాలా ప్రభావశీలంగా వాడుకోగలిగారని సాధారణంగా చెప్తుంటారు. నిజమే, స్థానిక సామాజిక, రాజకీయ వ్యవస్థల మీద వారు గణనీయమైన ప్రభావం చూపారనడంలో సందేహం లేదు. తెలంగాణ నుండి బీహార్ వరకు, వారి ప్రభావం లేకపోయినట్లయితే ఆయా సమాజాలు ఏవీ ఇప్పుడున్నట్లుగా ఉండేవి కాదు. వాటిని తలకిందులు చేయగలిగేంత ప్రభావం చూపగలిగారు వాళ్ళు. అన్ని రకాల దగాలను, మోసాలను నిరోధించడంలో వారు చాలా ప్రభావవంతంగా పనిచేశారనడం కూడ నిజమే. కానీ, దాదాపు నలభై సంవత్సరాల నక్సలైట్ ఉద్యమాన్ని అవలోకించినపుడు రాజ్యం తీసుకున్న కీలక విధాన నిర్ణయాలలో, అసమాన అభివృద్ధి వాదానికి స్వాభావికమైన ధోరణులలో నక్సలైట్లు నిరోధించగలిగినవి ఎంత తక్కువగా ఉన్నాయో చూసి ఆశ్చర్యపోతాం. నిజానికి, తడుముకోకుండా చెప్పడానికి ఒక్కటైనా కనిపించదు. దీనికి కారణం, తాము అసలు ఆ ప్రయత్నం చేయకపోవడం వల్ల అని వారు స్వయంగా జవాబు ఇవ్వొచ్చు. వారి వ్యూహాలు, ఆలోచనలు రాజ్యాన్ని రాజకీయంగా ఓడించడం మీద కాకుండా రాజ్యానికి

వ్యతిరేకంగా సైనిక సమీకరణ చేయడం చుట్టూ తిరుగుతాయనేది నిజం. కాబట్టి, రాజ్యాన్ని రాజకీయంగా గట్టిగా దెబ్బకొట్టడం, అసమాన లేదా వినాశకరమైన అభివృద్ధి ధోరణులను తిప్పికొట్టడం వారి అజెండాలో లేవు. ఒకవేళ వారు ఆ ప్రయత్నం చేసినా అలాంటి నిర్ణయాలను కానీ శక్తులను కానీ ఎలా అడ్డుకోవాలో వారికి తెలియదు. ఒక్కమాటలో చెప్పాలంటే భూస్వామి తలకు తుపాకీ గురి పెట్టొచ్చు కానీ ప్రత్యేక ఆర్థిక మండళ్లకు కానీ భారత్–అమెరికా అణు ఒప్పందానికి కానీ తుపాకీ గురి పెట్టటం కుదరదు. ఎందుకంటే వాటికి ఒక తల లేదు. సమస్యను ఈ స్థాయికి కుదించి మాట్లాడడం అన్యాయమని ఎవరైనా విమర్శించొచ్చు. మావోయిస్టు హింస అనేది రాబిన్‌హుడ్ తరహా వ్యక్తుల (పెద్దలను దోచి పేదలకు పంచే సాహసవీరుల) సాయుధ చర్యల స్థాయి కంటే ఎక్కువ అని ఒప్పుకోవడంలో ఇబ్బంది ఏమీ లేదు. అయినాసరే, అస్థిపంజరానికి తగినంత రక్తమాంసాలు జోడించినంత మాత్రాన దాని అసలు స్వరూపాన్ని అయితే మరుగుపరచలేరు.

పైన పేర్కొన్న సమస్యల మీద హింస ఒక విధానంగా పనిచేయకపోవడానికి కేవలం వాటి అమూర్తత (శత్రువు స్పష్టంగా కనిపించకపోవడం) మాత్రమే కారణం కాదు. శత్రువుకు రూపం లేకపోవచ్చు గాని జరుగుతున్న వినాశనానికి నిర్దిష్ట రూపాలు ఉన్నాయి. వాటిని హింసాత్మక సమీకరణతో గానీ, సాయుధ చర్య ద్వారా గానీ ఎదుర్కోవచ్చు. కానీ భూస్వామ్య వ్యవస్థ కాకుండా మిగతా అధికార రూపాలన్నీ నిగూఢంగా ఉండటం వల్ల గురిపెట్టి వాటి మీద హింసాత్మక పోరాటాలు చేయడం కష్టమవుతుంది. హింస మంచిదైనా, చెడ్డదైనా, అవసరమైనదైనా, అనవసరమైనదైనా అది ఎప్పుడూ మొరటుగానే ఉంటుంది. మరోవైపు, అధికారాన్ని తెలివిగా ప్రయోగించినపుడు అది నిగూఢంగా ఉండి అధికారంలా కనిపించదు. పెట్టుబడిదారీ తార్కికత కూడ అలాగే నిగూఢంగా పనిచేస్తుంది. అది కొన్నిసార్లు మొరటుగా అణచివేస్తుంది కానీ అన్నిసార్లూ మొరటుగా ఉండదు. మధ్యతరగతి వారికి మెరుగైన జీవితాన్ని అందిస్తానని ఆశలు కల్పిస్తుంది. పేదవారికి జీవనోపాధి కల్పిస్తాననే హామీలు ఇస్తుంది. అన్ని రంగాల్లోనూ తన కార్యకలాపాలను విడివిడిగా విస్తరించి ప్రతి దానినీ తనదైన ఒక హేతుబద్ధతతో సమర్థించుకుంటుంది. కొంచెం ఇచ్చి చాలా తీసుకుంటుంది. ఒక చోట ఇచ్చి, మరో చోట దోచుకుంటుంది. అది పది గొంతులతో మాట్లాడి ఒక్కొక్క గొంతులో కొంతైనా హేతుబద్ధత ఉండేలా చూసుకుంటుంది. అసలు స్వరూపాన్ని మాత్రం అస్పష్టమైన అబద్ధాల దొంతరల వెనుక దాచిపెడుతుంది. దానిని ఆపాలంటే అది చెప్పే అబద్ధాలను చాలా తెలివిగా బట్టబయలు చేయాలి. దాని మోసాలను యుక్తిగా ఆపాలి. ఎందుకంటే, సమర్థమైన ఉద్యమ వ్యూహంలో ప్రజా సమీకరణ లక్ష్యం ప్రత్యర్థిని నిలువరించడమే. ఇక్కడే శాంతియుత పద్ధతుల కంటే

హింసాత్మక పద్ధతులు ఎక్కువ ప్రభావశీలంగా ఉంటాయి. కాని ఒక సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి) అమలు కాకుండా అడ్డుకోవడానికి ఎవరిని దిగ్బంధించాలి? దేనిని దిగ్బంధించాలి?

ఆపైన చట్టం, దాని అమలు యంత్రాంగం ఉండనే ఉంది. ఒక భూస్వామికి లేదా స్థానిక పెత్తందారుకు వ్యతిరేకంగా హింసాత్మక ఉద్యమాలు జరిగినప్పుడు చట్టం వాటిని పట్టించుకోకుండా తల ఏమీ తిప్పుకోదు. కాని అభివృద్ధి పథకాలని చెప్తున్న వాటిని కానీ, జాతీయ భద్రతా విధానాలని చెప్తున్న వాటిని కానీ హింసాత్మక ఉద్యమాల ద్వారా అడ్డుకున్నప్పటితో పోల్చితే ఆ చర్యలలో రాజ్యం స్వప్రయోజనాలకు కలిగే విఘాతం, సమాజం నుండి వచ్చే అసమ్మతి తక్కువగా ఉంటుంది. ఏ ఆందోళనలైనా సాధారణ జనజీవనానికి భంగం కలిగిస్తాయి. హింసాత్మక ఆందోళనలు మరింత ఎక్కువగా భంగం కలిగిస్తాయి. అవి సృష్టించే అభద్రతను, అనిశ్చితిని ఉపయోగించుకుని రాజ్యం ఆందోళనకారులను కొట్టి చంపేంత స్థాయికి ప్రజలను రెచ్చగొట్టగలదు, లేదా వారిపై తాను అమలు చేస్తున్న హింసాత్మక అణచివేత పద్ధతులను కప్పిపుచ్చుకోగలదు. అంతేకాదు, తన అణచివేత విధానాలు న్యాయమైనవేనని సమర్థించుకోగలదు కూడ. రాజ్యానికి జరగగల నష్టాలు చాలా అధికంగా ఉన్నప్పుడు (హింసాత్మక ఉద్యమాల పట్ల) సామాజిక అసమ్మతిని సాధారణ స్థాయికి మించి కూడ రెచ్చగొట్టగలదు. రాజ్యం తన కీలక ప్రయోజనాలు దెబ్బతింటాయని భావించినపుడు ఆందోళనలకు, ముఖ్యంగా హింసాత్మక ఆందోళనలకు వ్యతిరేకంగా ఎంత విద్వేషాన్ని రాజేయగలదో మనందరికీ తెలుసు. దానిని అడ్డుపెట్టుకుని ఆ సమయంలో చట్టాన్ని ఎంతగానైనా ఉల్లంఘించగలదు. ఎంత ఉల్లంఘించినా అదంతా కూడ న్యాయబద్ధమైనదనే భావనను అది ప్రజలలో కలిగించగలదు.

అప్పుడిక చేతులెత్తేసి, చెడు అధికారంలో ఉండగా దానితో ఒక స్థాయికి మించి పోరాడటం వ్యర్థమని చెప్పడం ఒక్కటే దారి. రాజకీయ అధికారం సాధించి, చెడును సమూలంగా కూలదోయడమే మన అసలు దారి అనేది దానికి కొనసాగింపుగా వచ్చే ఆలోచన. ఇది ఒక కోణం నుండి అర్థవంతంగా కనిపిస్తుంది కానీ మరొక కోణం నుండి చూస్తే అసలు విషయాన్ని విస్మరిస్తోందని అర్థమవుతుంది. మూడో కోణం రేకెత్తించే ప్రశ్న మరింత కీలకమైనది. పై ఆలోచన అసలు విషయాన్ని విస్మరిస్తోందని ఎందుకు అనవలసి వస్తోందంటే ఉద్యమాలు విజయం సాధించడానికి ఏదైనా వ్యూహం ఉందా? అని మనకి మనం వేసుకుంటున్న ఈ ప్రశ్న ఒక స్థాయిలో ఈ సమాజానికి కానీ, ఈ రాజకీయ వ్యవస్థకు కానీ సంబంధించిన ప్రశ్న కాదు; అది మౌలికంగా ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రశ్న. పాలన అనేది ప్రజల అసమ్మతితో దిద్దుబాటుకు తలొగ్గుతుందా

అనే ప్రశ్న అది. మనం అధికారంలోకి రావాలనుకుంటున్నాం, మనం అధికారంలోకి వచ్చాక ఈ సమస్య ఉండదు, కాబట్టి ఈ విషయం గురించి మనం ఎక్కువ ఆలోచించాల్సిన అవసరం లేదు – అనడం ఈ ప్రశ్నకు సమాధానం కాదు. మూడో కోణం రేకెత్తిస్తున్న ప్రశ్న అంతకంటే కీలకమైనదన్నాను కదా! ఎందుకంటే దుష్ట పాలనకు వ్యతిరేకంగా ప్రజలను పెద్ద సంఖ్యలో ఎలా సమీకరించాలో మీకు తెలియనపుడు, రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి మాత్రం వారిని ఎలా సమీకరించాలో మీకు తెలుసునని మీరు ఎలా చెప్పగలరు?

హింసాత్మక సమీకరణ కంటే శాంతియుత సమీకరణకు ఒక సానుకూలత ఉంది. ఇందులో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనవచ్చు. అది తన లక్ష్యాలను మరింత నేర్పుగా ఎంచుకోవచ్చు. తన ఆందోళన పద్ధతులను మరింత వ్యూహాత్మకంగా రూపొందించుకోవచ్చు. ఆందోళన కొనసాగుతున్నప్పుడు కూడ చర్చకు – వ్యవస్థతో జరిగినా జరగకపోయినా సమాజంతో మాత్రం ఎక్కువ చర్చకు – అవకాశం ఇస్తుంది. చర్చకు వీలు కల్పించడానికి ఆందోళనను నిలిపివేయాల్సిన అవసరం ఉండదు కాబట్టి కీలకమైన విమర్శనాత్మక కోణాన్ని ఎప్పుడూ సజీవంగా కొనసాగించవచ్చు. రకరకాల తెలివితేటలతో వ్యవహరించగల ప్రత్యర్థి మీద చేసే ఏ పోరాటంలోనైనా ఇది చాలా ముఖ్యం. శాంతియుత పోరాట పద్ధతులు నైతికంగా మాత్రమే కాకుండా రాజకీయంగా కూడ ఎక్కువ ఆరోగ్యకరంగా ఉండటానికి ఇదొక కారణం. కాని విధాన నిర్ణయాలను కానీ, వ్యవస్థీకృత ధోరణులను కానీ తిప్పికొట్టడంలో హింసాత్మక పద్ధతుల కంటే శాంతియుత పద్ధతులే తక్కువ ఫలితాలను సాధిస్తాయి. ధర్నాలు, వీధి నాటకాలు, హర్తాళ్లు, అరగంట రాస్తా రోకోలు, వీధి మూలల్లో ప్రసంగాలు, జాతాలు అంతూ అలుపూ లేకుండా నిరంతరం కొనసాగినా రాజ్యం కానీ అంబానీలు కానీ కోల్పోయేదేమీ ఉండదనేది సుస్పష్టం. తరచుగా ఉద్యమకారులను నిస్పృహకు గురి చేసి, పరిష్కారం కోసం మావోయిస్టులను ఆశ్రయించేలా ప్రేరేపించే విషయం ఇదే. అప్పుడు వారు ఏమనుకుంటారంటే హింసతో తమకున్న అభ్యంతరమల్లా అది నైతికంగా సమస్యాత్మకం కావడమూ, భౌతికంగా సురక్షితం కాకపోవడమూ మాత్రమేనని. వారి విధానాలు మాత్రం తప్పకుండా ఫలితాలను ఇస్తాయని నమ్ముతారు. కాని ఇవ్వవు, అలా ఎప్పుడూ జరగలేదు.

ఇప్పుడు చట్టం విషయానికి వద్దాం. ఎన్నికలపుడు మాత్రమే కాకుండా మిగతా సమయాల్లో కూడ ప్రజల అసమ్మతికి పాలక వ్యవస్థలు బాధ్యత వహించేలా చేయడానికి మనం చట్టాన్ని ఆశ్రయించగలమా? భారతదేశంలోని రాజ్యాంగ ప్రజాస్వామ్యం అటువంటి ఆశకు పెద్దగా అవకాశమివ్వదని మనకు అనుభవపూర్వకంగా తెలుసు. కానీ ప్రజా

ప్రయోజన వ్యాజ్యాలు అనబడే పిల్‌ల పట్ల ఉద్యమకారుల్లో విపరీతమైన వ్యామోహం ఉంది. చట్టం గురించి తెలియకపోవడం, అలాగే న్యాయవ్యవస్థ తీరుతెన్నుల గురించి అవగాహన లేకపోవడం చాలావరకూ ఈ అపోహలకు కారణం. పిల్ అంటే రాజుల ధర్మగంట లాంటిదని సగటు తెలివి గల భారతీయులకు ఒక అభిప్రాయం ఉంది. అది పూర్వకాలంలో తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రజల కోసం – తమ బాధలను వినిపించడానికి, తక్షణమే న్యాయం పొందడానికి – మంచి రాజులు తమ భవనం వెలుపల వేలాడదీసేవారని చెప్పుకునే న్యాయగంటకు ఆధునిక సమానరూపం అని వారి అభిప్రాయం. స్త్రీలైనా, పురుషులైనా అప్పటిదాకా తమకు తెలిసిన న్యాయాధికార పరిమితులన్నిటినీ జడ్జిలు పిల్‌లను విచారించడానికి న్యాయస్థానాలలో ఆసీనమైనపుడు మరిచిపోతారని, అప్పుడు వారు ప్రతి తప్పునూ ఒక సముచిత ఉత్తర్వు ద్వారా సరిచేయగల మంచి నిరంకుశ పాలకులుగా మారిపోతారని నమ్ముతారు. నిస్పృహ ఒక్కటే ఈ భ్రమలకు కారణం కాగలదు. అంతకన్నా క్షమార్హం కానిది న్యాయవ్యవస్థ తీరుతెన్నుల గురించి కనీస అవగాహన లేకపోవడం. న్యాయమూర్తులను ఒక వర్గంగా చూసినపుడు, సరళీకరణ వచ్చినప్పటి నుండి అది తీసుకొచ్చిన రాజకీయ, ఆర్థిక ధోరణులతో వారు చాలావరకూ ఏకీభావంతో ఉండడం కనిపిస్తుంది. కారణాలు రహస్యం ఏమీ కాదు. వారు ఈ ధోరణుల వల్ల చాలా ఎక్కువ ప్రయోజనం పొందిన, పొందబోయే సామాజిక వర్గానికి చెందిన వారు కావడమే. పిల్‌ల గురించి ఇటీవల సుప్రీంకోర్టు కుర్రచేష్టలనదగ్గ ఉత్సాహం చూపిస్తూ అత్యంత పరిహాసంగా వ్యాఖ్యలు చేస్తోంది. పిల్‌లు వేయటానికి పిటిషన్లు పట్టుకుని ఢిల్లీ దాకా రావద్దని ఉద్యమకారులకు లేదా వ్యవస్థతో విసిగి వేసారిపోయిన పౌరులకు పరోక్షంగా సంకేతాలిస్తోంది. సుప్రీంకోర్టులో న్యాయ క్రియాశీలత (జ్యుడీషియల్ యాక్టివిజం) పట్ల ఉన్న అభిప్రాయ భేదాలను, వాటిపై అక్కడ వినిపిస్తున్న పరోక్ష వ్యంగ్య వ్యాఖ్యానాలను కూడ న్యాయ పత్రికలు (లా జర్నల్స్) ఇటీవల ప్రచురిస్తున్నాయి. అయితే ఈ భిన్నాభిప్రాయాలు సంప్రదాయవాద న్యాయ క్రియాశీలతకు, దాని పట్ల సంప్రదాయవాద విముఖతకు మధ్యనే ఉంటాయి.

వ్యవస్థ చేస్తున్న అన్ని రకాల దోపిడీని అడ్డుకునే మార్గాలను రూపొందించడం తప్ప మనకు వేరే దారి లేదు. వినాశకర విధానాల అమలును భౌతికంగా నిరోధించే బలం ఉన్నపుడు తప్ప ప్రజల సహేతుక విమర్శలను ఆలకించి గౌరవించటం భారత ప్రభుత్వం ఇంకా అలవరచుకోలేదు. అటువంటి బలాన్ని సంతరించుకునే మార్గాలను పోరాట ఉద్యమాలు వెదకాలి. రాజ్యానికి, పెట్టుబడికి అడ్డుగా నిలబడగల ప్రజలను పెద్ద సంఖ్యలో కదిలించి ఆ విధానాలను ఆపడం సూత్రప్రాయంగా ఉత్తమ పద్ధతి. కానీ జనం

సమైక్యం కావడంలో ఎన్నో సమస్యలున్నాయి. ప్రజలు భిన్న ప్రయోజనాల మధ్య చీలిపోయి ఉన్నారు. విడివిడి సమూహాలుగా విడిపోయి ఉన్నారు. పేదరికం, దౌర్భాగ్యాల కింద నలిగిపోయి ఉన్నారు. అత్యంత కిందిస్థాయి వరకూ కూడ అవకాశవాదమనే జబ్బుతో బలహీనమైపోయి ఉన్నారు – భారత రాజకీయ సంస్కృతికి కాంగ్రెస్ పార్టీ చేసిన అతిగొప్ప సేవ ఇది! తమ రాజకీయ పోషకులకు విశ్వాసపాత్రులుగా ఉంటూ ఉంటూ ప్రజలు నీరసించిపోయారు. ఆందోళనలు, ఉద్యమాల శూన్య నినాదాలు, నైతిక అవినీతిలను చూసి చూసి భ్రమలు తొలగిపోయి ఉన్నారు. ప్రత్యేకించి, నిస్వార్థపరులైన మునుపటి తరం ఉద్యమకారుల వంటి వారు ఇప్పుడు లేకుండా పోయారని జనం అభిప్రాయ పడుతున్నారు. ఇది ఎన్జీఓలు చేసిన అతి గొప్ప అన్యాయమని నేను అనుకుంటాను. అయితే ఇప్పుడు రాజకీయ ఉద్యమకారుల్లో చాలా భాగానికి కూడ ఇదే సంస్కృతి సర్వసాధారణమైపోయింది. మరోవైపు, రాజకీయ ప్రభావం పెరగడం వల్ల ప్రజల్లో అమాయకత్వం పోయింది. పోరాటం వల్ల కలిగే లాభనష్టాలను గతంలో కంటే చాలా ఎక్కువ జాగ్రత్తగా బేరీజు వేసుకుంటున్నారు. స్వయంగా ఉద్యమకారులే అదే పోకడలు పోతున్నపుడు జనాన్ని నిందించడానికి లేదు. ఇవన్నీ కలగలిసి బలమైన సమీకరణను కష్టతరం చేస్తాయి. నిజాయితీ గల ఉద్యమకారులు సైతం పరిష్కారాల కోసం సాయుధ చర్యల నుండి పిల్ల వరకూ అడ్డదారుల కోసం వెదికేలా ప్రలోభపెడతాయి.

కాని అడ్డదారులేవీ లేవు.

Beyond Violence and Non-Violence:
Is There a Strategy of Successful Struggle ?

published in Kafila.online on 23 January 2009

**తెలుగు అనువాదం : ఎ. చంద్రశేఖర్, పి. పృథ్వీరాజ్**

**మానవహక్కుల వేదిక (HRF) ప్రచురణ, 15 డిసెంబర్ 2024**

*printed at anupamaprinters 040-23391364*